# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

ఆదివారం | 13 | ఆగస్టు | 2023 | పేజీలు : 7




# నడిరోడ్డుపై డ్రైనేజీ గుంత...
# పొంచి ఉన్న ప్రమాదం

## ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



చిగురుమామిడి, ఆగస్టు 12 (మనం న్యూస్)ః అంతా అభివృద్ధి చేస్తున్నాం.. ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతోన్న మాటలు కేవలం ప్రకటనల వరకే పరిమితమవుతున్నాయి.. రోడ్లను అద్దాలుగా తీర్చుదిద్దుతున్నామని పేర్కొంటున్న పాలకుల మాటలు ఆచరణలో మాత్రం కానరావడం లేదు. గతుకులమయమైన రోడ్లు, పగిలిపోతున్న డ్రైనేజీల పైపులతో రోడ్లు ప్రమాదకరంగా మారుతున్నా పట్టించుకున్న నాథుడే కరవవుతున్నాడు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో రోడ్లను పరిశీలిస్తే ఇదే అవగతమవుతుంది. మండల కేంద్రమైన చిగురుమామిడిలో ప్రధాన రహదారులతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రధానంగా మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలున్న రహదారి పూర్తి అధ్వాన్నంగా తయారైంది. మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయాధికారి కార్యాలయంతో పాటు పోలీస్ స్టేషన్, విద్యుత్ సబ్ స్టేషన్, ఐకెపి కార్యాలయాలున్న ప్రాంతాలకు వెళ్లే రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. గాంధీ విగ్రహం సమీపాన ప్రభుత్వ కార్యాలయాల వైపుకు వెళ్లే దారిలో నడిరోడ్డులో డ్రైనేజీ కోసం వేసిన పైపులైన్ పగిలిపోయి, ఆ ప్రాంతంలో గుంత ఏర్పడి ప్రమాదకరంగా పరిణమించింది. ఇది ఏర్పడి నెలలు గడుస్తున్నా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. ఈ ప్రాంతం గుండా అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రయాణిస్తున్నప్పటికీ ఆ సమస్యను తీర్చడానికి మాత్రం ఎవరూ కృషి చేయడం లేదు. రోడ్డు పైనే ప్రమాదకరంగా ఏర్పడ్డ గుంత కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పట్టనట్లు వ్యవహరిస్తుండడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డ్రైనేజీని మరమ్మత్తు చేయడంతో పాటు రోడ్డును బాగుపరచాలని కోరుతున్నారు.






## రాజన్నను దర్శించుకున్న కరీంనగర్ సిపి సుబ్బారాయుడు

వేములవాడ టౌన్, ఆగస్ట్ 12, (మనం న్యూస్): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించు కుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సిపి దంపతు లకు నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వ చనం చేయగా, ఆలయ పర్య వేక్షకులు బి.తిరు పతి రావు శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ నాగేంద్ర చారి, సిఐ కరుణాకర్ పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఎలుగుబంటి హల్ చల్

**భయంతో పరుగులు పెట్టిన స్థానికులు - ముప్పుతిప్పలు పెట్టించిన ఎలుగుబంటి**

కరీంనగర్ క్రైం, ఆగస్టు 12 (మనం న్యూస్)ః కరీంనగర్ నగర శివారులో ఎలుగుబంటి సంచారం కలకలం సృష్టించింది. నడిరోడ్డుపై తిరుగుతూ ప్రజలను పరుగులు పెట్టించింది. అటవీ, కొండల ప్రాంతాల్లో ఉండాల్సిన ఎలుగుబంటి జనావాస ప్రాంతాల్లోకి రావడం, అదీ ప్రధాన రహదారి వెంబడి తిరగాడడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం రాత్రి బొమ్మకల్ పరిధిలోని రజ్వీ చమాన్ ప్రాంతంలో కనిపించిన ఎలుగుబంటి, శనివారం ఉదయం రేకుర్తిలో నడిరోడ్డుపై ప్రత్యక్షమైంది. దీంతో ఆ ప్రాంతంలోని ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఎలుగు బంటి వచ్చిన సమాచారాన్ని అధికారులకు తెలియపరచగా, వరంగల్ నుంచి వచ్చిన అటవీశాఖ ప్రత్యేక బృందం సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఇండ్లు, చెట్ల పొదల మధ్య దాక్కున్న ఎలుగు బంటిని పట్టుకునేందుకు యత్నించగా వారికి చిక్కకుండా ముప్పుతిప్పలు పెట్టింది. చుట్టూ వలలు ఏర్పాటు చేసి మత్తు ఇంజక్షన్ ఇచ్చి దాన్ని అదుపులోకి తీసుకున్నారు.

ఎలుగుబంటిని పట్టుకోవడానికి రెస్క్యూ టీం మొత్తం 12 గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఎలుగు బంటి చిక్కడంతో బొమ్మకల్, రేకుర్తి వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

## చలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభకు తరలిరావాలి



రామగిరి,ఆగస్టు 12 మనం న్యూస్ ః కొలిపాక సత్తయ్య,జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు నేటి ఆదివారం మధ్యాహ్నం కోరుట్లలో జరుగబోయే పద్మశాలి రాజకీయ యుద్ధభేరి పద్మశాలీ ఆత్మగౌరవ సభకు మంథని డివిజనులోకి పద్మశాలీయులందరు ప్రతి ఇంటినుండి కదలివచ్చి పద్మశాలీయుల ఐక్యతచాటి సభకు హాజరై విజయవంతం చేయాలని జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కొలిపాక సత్తయ్య,జిల్లా పద్మశాలి సంఘ కార్యవర్గ సభ్యులు బండారి సదానందం,నాయకులు కొలిపాక సారయ్యలు పిలుపునిచ్చారు. ఆదివారం డివిజను కేంద్రం సెంటినరీకాలనీ నుండి బస్సులను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికలలో తమ సంఖ్యకు సరిపడ సీట్లను రాజకీయ పార్టీలు కేటాయించాలని, పద్మశాలీలకు ఆర్థికంగా చేయూతనిచ్చే పథకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ప్రతీ నేర ఘటనలో నిందితులు శిక్షింపబడాలి

### అదనపు డిసిపి రాజు



కరీంనగర్ క్రైం, ఆగస్టు 12 (మనం న్యూస్)ః ప్రతీ నేర సంఘటనలో నిందితులు శిక్షింపబడేలా కోర్టు డ్యూటీ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కరీంనగర్ అదనపు పోలీస్ కమిషనర్ సి.రాజు తెలిపారు. శ్రద్ధాసక్తులు, ఉత్సాహంతో పనిచేయడం ద్వారా అనుకున్నది సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. శనివారం కమిషనరేట్ కేంద్రంలో కోర్టు డ్యూటీ అధికారుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేసులోని దశలను సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడూ తెలియజేస్తూ పటిష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా నిందితులు శిక్షింపబడుతారనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. సిడివోలు కేసులు ఏయే దశల్లో ఉన్నాయో ఏరోజుకారోజు సిసిటిఎన్ఎస్ లో అప్లోడ్ చేయాలని చెప్పారు. ఏరోజు పనిని ఆరోజే పూర్తిచేయాలని, వాయిదా వేయడం పద్ధతి సరైందికాదని సూచించారు. ఏనేర సంఘటనైనా ఒక ఛాలెంజ్ గా తీసుకుని ప్రణాళికబద్ధంగా ముందుకుసాగితే సఫలీకృతం అవుతామనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. నిందితులు శిక్షింపబడటం ద్వారా పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందడంతోపాటు అన్నివర్గాల ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. నిందితులు శిక్షింపబడటంలో నూతనోత్సాహంతో పనిచేసే సిడివోలకు ప్రోత్సాహకాలను అందజేస్తామని ప్రకటించారు. నిందితులు శిక్షింపబడటం ద్వారా నేరాలు నియంత్రణలోకి రావడంతోపాటు. పాతనేరస్థులు జైలుశిక్షలు విధించబడుతాయనే భయంతో నేరాలకు పాల్పడకపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. సిడివోలతోపాటు ఇతర విభాగాలకు చెందిన అధికారులు తమలో నెలకున్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలని, టెక్నాలజీ పరంగా తమసేవలనందించేందుకు కమీషనరేట్ కేంద్రంలో ఐటి సెల్ విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిసిఆర్‌బి ఎస్ఐ నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి ఎంపి సీటలు ఎస్సీ మాదిగ వర్గానికి కేటాయించాలి



సుల్తానాబాద్,ఆగస్టు 12 మనం న్యూస్ ః రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు సీటుతో పాటు రిజర్వేషన్ గల అన్ని అసెంబ్లీ స్థానాలలో మాదిగ సామాజిక స్థానిక ప్రతినిధులకు కేటాయించాలని కవ్వంపల్లి దుర్గయ్య,పల్లె సదానందం,కవ్వంపల్లి చంద్రయ్య,ఎస్సీ సెల్ బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి ప్రభాకర్,మంథని రమేష్,బిజెపి ఎస్సీ సెల్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఆరెపల్లి రాకేష్ కోరారు. శనివారం సుల్తానాబాద్ వైశ్యభవన్‌లో ఏర్పాటు చే సిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు దాదాపు రెండు లక్షల 80 ఓటర్లు ఉన్నా కానీ స్థానిక మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకునికి కాకుండా వేరే ప్రాంతాల నుండి వలస వస్తున్నటువంటి ఎస్సీ సామాజిక వర్గంలోని ఇతర నాయకులకు కట్టబెడుతూ మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు రిజర్వేషన్ నియోజకవర్గంలో స్థానిక నాయకులకు పార్లమెంట్ టికెట్ కేటాయించకుండా అవమానపరుస్తున్నారని అన్ని పార్టీలు మాదిగ సామాజిక వర్గాన్ని గుర్తించి పార్లమెంట్ అసెంబ్లీ స్థానాలలో స్థానిక నేతలను గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సీటును స్థానిక నేతలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు పరిధిలోని అన్ని మండల కేంద్రాలలో ఎస్సీ సామాజిక మాదిగ వర్గాన్ని చైతన్యం చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నట్లు ఈ నెల 20న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎస్సీ మాదిగ సామాజిక వర్గ ప్రజాప్రతినిధులు మేధావులు మాదిగ మీడియా రిపోర్టర్లు ఉద్యోగ వర్గాలు అన్ని పార్టీలలో ఉన్న ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశ అనంతరం రానున్న ఎన్నికల్లో తీసుకోబోయే ముందస్తు ఎన్నికల ప్రణాళిక తయారు చేసే పెద్ద ఎత్తున మాదిగ ఆత్మ గౌరవ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ద్వారా తమ యొక్క ప్రణాళికను పెద్దపల్లి పార్లమెంటు పరిధితో పాటు అన్ని నియోజకవర్గంలో తెలిసే విధంగా పలు కార్యక్రమాలను చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా పెద్దపల్లి జిల్లాలో ఉన్నటువంటి మాదిగ సామాజిక వర్గం రానున్న ఎన్నికల్లో తమ సత్తా చాటాలని వారు కోరారు. అవసరమైతే అన్ని పార్టీలలో ఉన్నటువంటి ప్రజాప్రతినిధులు మేధావులు ఏకతాటి వచ్చి మాదిగ సామాజిక వర్గానికి చెందిన స్థానిక నాయకున్ని పార్లమెంటుతో పాటు రిజర్వేషన్ గల అసెంబ్లీ స్థానాలలో గెలిపించేందుకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, ఓదెలు, కొమురయ్య, మల్లేశం, శ్రీనివాస్ ,సతీష్, మధు, లక్ష్మణ్,సదయ్య,కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెనే హాస్పిటల్‌లో అన్నదానం



కరీంనగర్, ఆగస్టు 12 (మనం న్యూస్): నగరంలోని రెనే హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి మాతృమూర్తి లక్ష్మి వర్ధంతి సందర్భంగా శనివారం రెనే హాస్పిటల్‌లో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు మూడు వందల మందికి పైగా అన్నదానం చేశారు. అనంతరం రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీ లక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యలో ఉచిత ఆపరేషన్లు, ఉచిత ఐవిఎఫ్ శిబిరాలతో పాటు ఉత్తర తెలంగాణా వ్యాప్తంగా అనేక ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రాచారి, డాక్టర్ దామోదర్ రెడ్డి, డాక్టర్ మునీష్, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ నిఖిల్ లక్ష్మణ్, డాక్టర్ దీక్షిత్ బొజ్జా, డాక్టర్ యూసఫ్, మొహమ్మద్ రఫీ తో పాటు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు పెనాల్టీ రద్దు చేయాలి



రామగిరి,ఆగస్టు 12 మనం న్యూస్ ః కాంట్రాక్ట్ కార్మికులకు పెనాల్టీ రద్దు చేయాలని మల్లిపుల్ పనులు చెప్పొద్దని ఆగస్టు 16న తేదీన ఆర్జీ–3 జీఎం ఆఫీసు ముందు జరిగే ధర్నాను కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియూ శనివారం ఓసిపిఓలో వివిధ విభాగాల్లో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ చట్టపరంగా కాంట్రాక్ట్ కారిక్మకులకు లీవులు పండుగ మాస్టర్లు అమలు చేయకుండా యాజమాన్యం ఒక్కరోజు కార్మికుడు విధులకు హాజరు కాకపోతే 370 రూపాయలు పెనాల్టి పేరున రికవరి చేయడానికి తీవ్రంగా వ్యతిరేకించాలని దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని పని విషయంలో కూడా టెండర్ కు సంబంధంలేని మల్లిపుల్ బాబులు చెప్పడం సరికాదని చట్టాలు ఉల్లంఘించే సింగరేణి యాజమాన్యం కార్మికుల వద్దకు వచ్చారికే చట్టాలను చెప్పడం దయ్యాలు వేదాలు వర్ణించిన చందముగా కనిపిస్తున్నది కాబట్టి ఇప్పటికైనా ఈ విషయాల్లో యజమాన్యం స్పందించి తక్షణం వీటిని రద్దు చేయాలని దీనికి వ్యతిరేకంగా జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని వెంకన్న మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి రజనర్సు ,పి రమేష్, సంపత్, ఇమామ్, శ్రీనివాస్, సురేష్,రమేష్, ఎల్లయ్య ,చంద్రయ్య ,తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి గర్జనను విజయవంతం చేయండి

### పద్మశాలి యువత రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెగడ చందు

సుల్తానాబాద్,ఆగస్టు 12 మనం న్యూస్ ః పద్మశాలీలకు రాజ్యాధికార సాధన కోసం తలపెట్టిన కోరుట్ల పద్మశాలి ప్రజా గర్జనను పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండలాల గ్రామాల నుండి పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పద్మశాలి గర్జనను విజయవంతం చేయాలని పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెగడ చందు పిలుపునిచ్చారు. ఈ నెల 13వ తేదీన కోరుట్లలో నిర్వహిస్తున్న పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాజకీయంగా మనకు రావాల్సిన వాటాను పొందాలని పద్మశాలీలు వచ్చే ఎన్నికలలో ఐక్యంగా ఉండి పద్మశాలి అభ్యర్థులను అభ్యర్థులను పార్టీలకు అతీతంగా గెలిపించి అసెంబ్లీలో పద్మశాలి సత్తాను చాటే విధంగా కృషిచేయాలని అన్నారు. పద్మశాలీలు ఏ పార్టీలో ఉన్న పార్టీలకు అతీతంగా గెలిపే లక్ష్యంగా కృషి చేయాలని ఈ ఎన్నికలలో పద్మశాలి అభ్యర్థులు ఎక్కడ నుండి పోటీ చేసిన విజయం సాధించేలా అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పెద్దపల్లి జిల్లా నుండి అధ్యక్షులు వేముల రామ్మూర్తి,ప్రధాన కార్యదర్శి అయిల రమేష్,ఉప అధ్యక్షులు సాయిరి మహేందర్,వలస నీలయ్య ఆధ్వర్యంలో భారీగా బయలు దేరి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారులకు

# ఆత్మీయ పలకరింపు



తిమ్మాపూర్, ఆగస్టు 12 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని తిమ్మా పూర్, అలుగునూర్, పోరండ్ల గ్రామాల్లో అందుబాటులో ఉన్న పలువురు ఉద్యమకారులు, ప్రజాప్రతి నిధుల ఆత్మీయుల పలకరింపులో భాగంగా శనివారం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల జోగి రెడ్డితో కలిసి రాష్ట్ర ఆహార భద్రత క మిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ వారి నివాసాలకు వెళ్లి యోగ క్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా పోరండ్ల గ్రామంలో నాటి బిఆరెస్ ఆవిర్భావం నుండి పని చేస్తూ నియోజవర్గంలో మొట్ట మొదటిసారిగా అమరవీరుల స్థూపాన్ని గ్రామస్థుల సహకారంతో నిర్మించి తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన భాస్కర్ ఇంటికి ఉద్యమకారుల తో కలిసి స్వయంగా వెళ్లి శాలువాతో ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ ఇంటికి వెళ్లి ప్రతి ఉద్యమకారుడిని ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఆనాడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఇచ్చిన ఒక్క పిలుపు కి తనను నమ్మి నాతో వచ్చి తెలంగాణ కోసం అహర్నిశలు తనతో పాటు కష్టపడ్డ ప్రతీఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, ఓరుగంటి యువసేన నాయకులు, తదితరులు పాల్గొ న్నారు.


## సుల్తానాబాద్ వాసికి తహసీల్దార్‌గా ప్రమోషన్

సుల్తానాబాద్,ఆగస్టు 12 మనం న్యూస్ : సుల్తానాబాద్ పట్టణానికి చెందిన నగునూరి శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి తహసీల్దార్‌గా ప్రమోషన్ పొంది భూపాల్‌పల్లి జిల్లాలో విధులు నిర్వహించను న్నారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన నగునూరి శ్రీనివాస్ తహసీల్దార్‌గా ప్రమోషన్ పొందడంతో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సిఫార్సుతో

# మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



రామగిరి,ఆగస్టు 12 మనం న్యూస్ : ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన రామగిరి మండలం కాంగ్రెస్ నాయకులు,మంథని శాసనసభ్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో రామగిరి మండలం కల్వచర్ల రత్నాపూర్ గ్రామానికి చెందిన ఒర్రె కుమార్‌కు 60,000 రూపాయల చెక్కు,కొండపర్తి అమరేందర్‌కు 24000 రూపాయల సిఎంఆర్ ఎఫ్ చెక్కును రామగిరి మండలం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట చంద్రయ్య,మంథని అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్,పన్నూర్ ఎంపిటిసి చిందం మహేష్,రామయ్యపల్లి సర్పంచ్ దేవునూరి రజిత శ్రీనివాస్,సెంటినరికాలనీ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు కాటం సత్యం,రామగిరి మండలం మాజీ ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కండె పోశం,రైతు సంఘం అధ్యక్షుడు ఉడత శంకర్,మట్ట రాజకుమార్,మన్యంపెల్లి శ్రీనివాస్,పెరుమాండ్ల ప్రసాద్,తాటి సతీష్,సిద్ధం రామనారాయణ,అంగూరి రమేష్,రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ శ్రీధర్,వీణ తదితరులు పాల్గొన్నారు.



## పదోన్నతి పొందిన పంచాయతీ

## కార్యదర్శిని సన్మానించిన సర్పంచ్

రామగిరి,ఆగస్టు 12 మనం న్యూస్ : పన్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తు ఇటీవల రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి పొందిన పంచాయతీ కార్యదర్శి పూరెళ్ల ఆకాష్‌గౌడ్‌ను స్థానిక సర్పంచ్ అల పద్మ తిరుపతి ఆధ్వర్యంలో పాలక వర్గ సభ్యులతో కలిసి ఘనంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దామోర శ్రీనివాస్‌యాదవ్,వార్డు సభ్యులు సల్వాల రమ్య సంపత్,నాగుల రమాదేవి కృష్ణ,గంధం అర్చన,పెరుమండల్ల శంకర్,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ,ఏపిఏ ఏరియాలలో

# ఉద్దమ ఉద్యోగుల ఎంపిక




రామగిరి,ఆగస్టు 12 మనం న్యూస్ : 77వ,స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆర్జీ-3,ఏపిఏ ఏరియాలలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేయడం జరిగినది తెలిపారు. ఉత్తమ ఉద్యోగులగా మల్క మధునయ్య, ఏం రమేష్ ,కటుకు ఒదయ్య,కే భీమయ్య,బుడిగే క్రాంతి కుమార్,సిద్ధ రాజకుమార్,బొండ్ల రవి,ఉత్తమ ఎన్ సి డబ్లు గా కళబోయిన మల్లేష్,అబ్దుల్ హామీద్ లను నిర్ణయించారు. వీరిని ఆగస్టు 15న రోజున జిఎం కార్యాలయం నందు నిర్వహించబడు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో సన్మానించడం జరుగుతుందని ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్‌రావు,ఏపిఏ జిఎం కే.వెంకటేశ్వర్లు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## దళిత హక్కుల పోరాట సమితి పట్టణ కమిటీ ఎన్నిక



వేములవాడ టౌన్, ఆగస్ట్ 12, (మనం న్యూస్): వేములవాడ పట్టణ (మండల్) దళిత హక్కుల పోరాట సమితి కమిటీని 9 మందితో శనివారం ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షులుగా ఎల్లదేవరాజు, ఉపాధ్యక్షులుగా గాజుల పోచయ్య, కార్యదర్శిగా తాండ్ర అనీల్, సహాయకార్యదర్శిగా వడ్లూరి దేవయ్య, సామల్ల మల్లయ్య, సంతోష్, బాబు ఎన్నికయ్యారు. ఇట్టి సమావేశానికి డీహెచ్పీఎస్ రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లిలక్ష్మన్, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు కడారి రాములు ముఖ్యదితిగా హాజరై,ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం స్ఫూర్తితోదళితులు తమ హక్కులను సాధించుకోవడానికి సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు .

## అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఎన్నిక



కరీంనగర్, ఆగస్టు 12 (మనం న్యూస్): కరీంనగర్ రూరల్ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా బి.రమణ, కార్యదర్శిగా కష్ణవేణిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక టిఎన్జీవోల సంఘ భవనంలో టిఎన్జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికలను నిర్వహించగా, ఎన్నికల అధికారులుగా ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి , మారుపాక రాజేశ్వర్లు వ్యవహరించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులందరూ ఏకవాక్య తీర్మానంతో అంగన్వాడీ హెల్పర్లను , టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, అర్బన్ అధ్యక్షులు సర్దార్ హర్విందర్ సింగ్ ,రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేశ్వరద్వాజ్ ,అంగన్వాడి జిల్లా నాయకులు మేరీ లలిత ,స్వరూప ,లక్ష్మి ,భాగ్యలత సుమారు 150 మంది అంగన్వాడి టీచర్లు , హెల్పర్లు పాల్గొన్నారు.

## పద్మశాలి రాజకీయ యుద్ధభేరిని జయప్రదం చేయాలి



హుజురాబాద్ రూరల్, ఆగస్టు 12 (మనం న్యూస్): జగిత్యాల జిల్లా కోరుట్లలో జరుగనున్న పద్మశాలి రాజకీయ యుద్ధభేరి ఆత్మగౌరవ సభలో హుజరాబాద్ నియోజకవర్గంలోని పద్మశాలీలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సంఘ నాయకులు సంఘం సత్యనారాయణ , చిలుకమర్తి శ్రీనివాస్, జడల చిరంజీవి, ఇప్పలపల్లి చంద్రశేఖర్, బండి కోటేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన అత్యధిక శాతం లో ఉన్న పద్మశాలీ సామాజిక వర్గం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. పద్మశాలి కులభాందవులలో చైతన్యం రగిలించడానికి, రాజకీయ అవగాహన కల్పించడానికి రాష్ట్ర ప్రముఖులు, సామాజిక వేత్త సబ్బని వెంకట్, పరికిపండ్ల నరహరి ఐఎఎస్‌ల సారథ్యంలో ఛలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరి, ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు నియోజకవర్గంలోని పద్మశాలీ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

## గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు



మెట్‌పల్లి, ఆగస్టు 12 (మనం న్యూస్) : యుద్ధ నౌక, విప్లవ నాయకులు గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని కోరుట్ల నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి అధ్యక్షులు బర్ల సాయన్న అన్నాడు. స్థానిక జెఎసి కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సందర్భంగా గద్దర్ రచించి, ఆలపించిన పాటలు అనేక మందిని ఉద్యమం వైపు నడిపించాయన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు మేకల హనుమాన్లు, బాల్క శంకరరావు, బడే లక్ష్మణ్, సంగార్తి నీలకంతం, ఉల్లందుల శంకర్, కనుకయ్య, బర్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఎన్నికల పట్ల అవగాహన కలిగి ఉండాలి

## ఫాదర్ అశోక్‌రెడ్డి




సుల్తానాబాద్,ఆగస్ట్ 12 మనం న్యూస్ : విద్యార్థులు ప్రజాస్వామ్యంలో ఎన్నికల పట్ల అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్ సెయింట్‌మేరీస్ పాఠశాల కరెస్పాండెంట్ ఫాదర్ తుమ్మ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన ఎన్నికల లెక్కింపు కార్యక్రమం తర్వాత గెలుపొందిన వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకత సంతరించుకున్న రాజ్యాంగం అని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజంగంలో ఎన్నికలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అందుకే విద్యార్థుల్లో ఎన్నికల పట్ల అవగాహన కలిగించేందుకే ఎన్నికలు నిర్వహించి వారికి ప్రతి విషయం తెలియపర్చినట్లు తెలిపారు. గెలుపొందిన వారిలో ఎస్పిసెల్‌గా మౌనిక,ఏఎస్పిల్‌గా అలేఖ్య,స్పోర్ట్స్ సెక్రటరీ గా




వేధఘ్ను,కల్చురల్ సెక్రటరీ గా స్ఫూర్తి,డిసిప్లీన్ సెక్రటరీగా శ్రీ వర్షిణీ లు ఎన్నికయ్యారని తెలిపారు. ఇదే క్రమంలో బ్లూ గ్రూప్ కెప్టెన్‌గా కౌశిక్,వైస్ కెప్టెన్‌గా అక్షర,గ్రీన్ గ్రూప్ కెప్టెన్ గా జశ్వంత్ తేజ,వైస్ కెప్టెన్ గా సింధుజా రాజ్,రెడ్ గ్రూప్ కెప్టెన్ గా రాజు,వైస్ కెప్టెన్ గా శ్రీ వర్షిణి,ఎల్లో గ్రూప్ కెప్టెన్‌గా త్రీనాథ్,కెప్టెన్ గా ఆశ్రితలు ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికయిన విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికైనా విద్యార్థులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన పదవులకు పాఠశాలలో న్యాయం చేస్తామని హామీనిచ్చారు. ఎన్నికల అధికారులుగా పాఠశాల అధ్యాపకులు వ్యవహరించి ఎన్నికల నియమావళిని విద్యార్థులకు అర్ధమమే విధంగా తెలియజేప్పారు. కార్యక్రమానంతరం విద్యార్థులు ప్రత్యేకంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో భారతదేశ సాంప్రదాయ పరంగా దుస్తులు ధరించి నృత్యాలు చేసి చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ప్రిన్సిపాల్ తుమ్మ అశోక్‌రెడ్డి,అసిస్టెంట్ ఫాదర్ వినయ్,పాఠశాల అధ్యాపక బృందంతో పాటు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కాల్వశ్రీరాంపూర్,ఆగస్టు 12 మనం న్యూస్ : శనివారం కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జాంపేట చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మూల మొగిలి తిప్పని కుమార్ పంజాల మొగిలి,తిప్పని తిరుపతి,రోహిత్, రంజిత్, అనిల్, అభిషేక్,రాకేష్,అజయ్,సునీల్‌లతో పాటు తదితర యువకులు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే,టిపిసిసి ఉపాధ్యక్షులు చింతకుంట విజయరమణరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన విజయరమణరావు ఈ కార్యక్రమంలో కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపిపి గోపగాని సారయ్యగౌడ్,మాజీ ఎంపిటిసి పోశాల సదానందం,బొడ్డుపెల్లి సాయికిరణ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బిఎస్పీ ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మ దగ్ధం



కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 12 (మనం న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్ 2 పరీక్షలకు సిద్ధమవుతున్న ఐదు లక్షల 75 వేల మంది నిరుద్యోగుల జీవితాలతో సిఎం కెసిఆర్ చెలగాటమాడుతున్నారని పేర్కొంటూ సత్యాగ్రహ దీక్ష చేస్తున్న బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడులు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను గృహ నిర్బంధం చేయడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ముఖ్య మంత్రి కెసిఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ జిల్లా ఇంచార్జి మేకల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కి బాలకిషన్, జిల్లా సంఘటన మంత్రి మహేష్, జిల్లా కోశాధికారి కాంపల్లి రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు బండపల్లి శ్రీకాంత్, మహంకాళి తిరుపతి, మానకొండూరు నియోజకవర్గ అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శులు గొల్లపు వెంకన్న గౌడ్, కుమ్మరి సంపత్, మంద రవీందర్, కొంకట శేఖర్, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మారేపల్లి మొగులయ్య, దొడ్డే శ్రీనివాస్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు నల్లాల రాజేందర్, మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు భువనగిరి ప్రభాకర్, వివిధ మండలాధ్యక్షులు సోషల్ మీడియా జిల్లా ఇంచార్జి మేక సాయి కుమార్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవినీతికి పాల్పడుతోన్న రైస్ మిల్లర్లపై

# పిడి యాక్ట్ నమోదు చేయాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి




హుజురాబాద్ రూరల్, ఆగస్టు 12 (మనం న్యూస్): పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు రేషన్ బియ్యం ఇస్తుంటే కొంతమంది రైస్ మిల్లర్లు తమ ఏజెంట్లను పెట్టుకొని రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేస్తూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతూ కోట్ల రూపాయలు గడిస్తున్నారని, అలాంటి రైస్ మిల్లర్లపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ మండల కేంద్రంలోరి రైస్ మిల్లుల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నా, సంబంధిత సివిల్ సప్లై అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతుల నుండి ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని 2022-2023 సంవత్సరంలో రైస్ మిల్లర్ల కేటాయింపులకు తగ్గట్టుగా బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వలేదని పేర్కొన్నారు. ధాన్యాన్ని కొంతమంది మిల్లర్లు అమ్ముకొని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టారని, కొంతమంది రైస్ మిల్లర్లు మరో జిల్లాలో కోట్లాది రూపాయలతో రైస్ మిల్లు నెలకొల్పారని ఆరోపించారు. ధాన్యాన్ని రికవరీ చేయడంలో ప్రభుత్వం, అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉన్న జిల్లాలోనే 81 రైస్ మిల్లర్లకు నోటీసులు జారీ చేసి నెల రోజులు గడుస్తున్నా సదరు అవినీతి రైస్ మిల్లర్లు బియ్యాన్ని లెవీ పెట్టడం లేదని వాసుదేవరెడ్డి తెలిపారు. సివిల్ సప్లై జిల్లా అధికారులపై అవినీతి రైస్ మిల్లర్లు ఒత్తిడి తెస్తూ పబ్బం గడుపుకుంటున్నారని, తమకు ఎందుకు వచ్చిందని సివిల్ సప్లై అధికారులు గుమ్మనంగా ఉంటున్నారని, వీరికి అవినీతి మరకలు అంటాయా అనే అనుమానం వస్తుందన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్, బిజెపిలు అనేక హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. హామీల అమలుకు ప్రజలు సంఘటితమై ఎక్కడికక్కడ నాయకులను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, జోన్ కమిటీ సభ్యులు గుండేటి వాసుదేవ్ లు పాల్గొన్నారు.



# ఎస్ఐ ఉద్యోగం పొందిన యువతికి అభినందన

వేములవాడ టౌన్, ఆగస్ట్ 12, (మనం న్యూస్): ఇటీవల విడుదలైన పోలీస్ ఉద్యోగాల ఫలితాల్లో ఎస్ఐగా ఎంపికైన వేములవాడ పట్టణానికి చెందిన కొప్పుల స్వాతిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ గోలి మోహన్ అభినందించారు. ఈ సందర్భంగా కొప్పుల స్వాతిని శుక్రవారం గోలి మోహన్ కలిసి శాలువాతో ఘంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతి పోలీస్ వృత్తని ఎంచుకొని, ఎస్ఐ ఉద్యోగం పొందడం గర్వించదగ్గ విషయమని అన్నారు. యువత సరియైన సమయంలో సరైన దృష్టి పెట్టి చదివితే ఎలాంటి ఉద్యోగమైన సాధించవచ్చన్నారు. సమయాన్ని వృధా చేయకుండా చదివితే ప్రతి ఒక్కరి లక్ష్యం నెరవేరుతుందన్నారు. రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలో ఒక మంచి కోచింగ్ సెంటర్ ను నిర్మించి, ఉచితంగా సివిల్ సర్వీస్, గ్రూప్ -1, గ్రూప్ -2, ఇతర ఉద్యోగాల కోసం సన్నద్ధం అవడానికి ప్రత్యేక కృషి చేస్తానని అన్నారు. స్వాతి లాంటి అమ్మాయిలు ధైర్యంగా ముందుకు వచ్చి, ఉద్యోగాలు సంపాదించాలని సూచించారు. భవిష్యత్తులో సాంకేతికతనే ప్రపంచం ముందుకు నడుస్తుందని, అందువల్ల నైపుణ్యంతో కూడినటువంటి విద్యను అభ్యసించాలని సూచించారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికతో ముందుకు వస్తున్నానని, యువత ఊర్లో కాదు ఉద్యోగంలో ఉండాలనే శీర్షికతో ఎంచుకున్నసంకల్పానికి వేములవాడ నియోజకవర్గంలోని యువత ముందుకు రావాలని కోరారు. స్వాతి మరిన్ని పదోన్నతులు పొంది, ఉన్నత స్థానానికి చేరుకోవాల్ని ఆకాంక్షించారు.

# పారమితలో ఎన్నికల పై అవగాహన




కరీంనగర్, ఆగస్టు12 (మనంన్యూస్): పారమిత హెరిటేజ్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాలకు హెడ్ బాయ్, హెడ్ గర్ల్, క్రీడ రంగానికి, క్రమశిక్షణ రంగానికి సాంస్కృతిక లీడర్లను , హౌజ్ నాయకులను ఇ.వి.యం. విధానంలో ఓటుహక్కును వినియోగించుకొని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమలో విద్యార్థులే బూత్ అధికారులుగా, ఎలక్షన్ అధికారులుగా ప్రిసైడింగ్ అధికారిగా ఎన్నికల నిర్వహణ అధికారిగా విద్యార్థులు ఉండడం గమనార్హం. విద్యార్థులు ఆసక్తిగా ఓటు హక్కును వినియోగించుకు న్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఉపాద్యాయులను విద్యార్థులను పాఠశాల అధినేత డా. ఇ. ప్రసాద్ రావు ప్రత్యేకంగా అభినందించి, సమాజంలో ఓటుకు ఉన్న విలువను తెలుపుతూ నేటి బాలలే రేపటి భావి పౌరులని భవిష్యత్ విద్యార్థులదేనని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డైరెక్టర్లు ప్రసూన, అనూకర్, వినోద రావు వి.యు.యం ప్రసాద్ , పాఠశా ప్రధానోపాద్యాయు రితేష్ మెహతా, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయ కర్తలు రబీంద్రపాత్రో, రాము హరిప్రియ, సరిత, ఉపాద్యాయినీ ఉపాద్యాయులు, విద్యార్లులు పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీ కార్మికుల దీక్షకు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి సంఘీభావం



బోధన్, ఆగస్టు 13 (మనం న్యూస్): మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి శనివారం నియోజకవర్గం లోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో దీక్ష చేస్తున్న ఫ్యాక్టరీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సంద్భంగా బోధన్ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు, హుంసా సొసైటీ చైర్మన్ మందర్నా రవి ఎడమకాలికి ఆపరేషన్ జరగడంతో ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తాహెర్ బిన్ హందన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు లింగం, నాగేశ్వర్రావు, నరేందర్ రెడ్డి, గణపతి రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు ఫరాన్, అల్లే రమేష్, దాము తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

### బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ రవి గౌడ్



సిరిసిల్ల అర్బన్, ఆగస్టు12 (మనం న్యూస్): బిసి హాస్టళ్ల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్ అన్నారు. శనివారం బిసి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పక్కా భవనం లేక విద్యార్థులు చాలా ఇబ్బందులపాలవుతున్నారని, పలు హాస్టళ్లలో మరుగుదొడ్లు లేక అనేక అవస్థల పాలవుతున్నారన్నారు. వర్షాకాలంలో సమస్యలు మరింత తీవ్ర తరం అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం జూనియర్ కళాశాల అధ్యక్షుడు చిట్టబోయిన రాకేష్, హాస్టల్ విద్యార్థులు రమేష్, నరేష్, సునీల్, వంశీ, నరేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




హుజురాబాద్ రూరల్, అక్టోబర్ 12 (మనం న్యూస్): ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ అధ్యక్షతన స్థానిక ఎస్సీ హాస్టల్‌లో ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ హాజరై అరుణపతాకాన్ని ఎగురవేసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు జూపాక శివమణి, వరుణ్ తేజ్, చరణ్, ప్రవీణ్, తరుణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి



మానకొండూరు, ఆగస్టు 12 (మనం న్యూస్): దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు ఈ నెల 15వ తేదీన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ప్రతి ఒక్క ఇంటిపైన జాతీయ జెండాలను ఎగురవేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా, మేరీ మాటీ.. మేరా దేశ్ కార్యక్రమాన్ని మండలంలోని గంగిపల్లి గ్రామంలో బిజెపి జిల్లా కార్యదర్శి, ఎంపిటిసి సభ్యులు రంగు భాస్కరాచారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర అమృత మహోత్సవాల ముగింపు కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడానికి జాతీయ పార్టీ నిర్ణయం తీసుకుందని, ఆ మేరకు ఈనెల తొమ్మిది నుండి 30 వరకు దేశవ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మేరీ మాటీ - మేరా దేశ్ ప్రోగ్రాంలో భాగంగా ముందుగా జిల్లాలో వీరులకు సన్మానం ,స్వాతంత్ర్య సమరయోధులు, రిటైర్డ్ రక్షణ దళాలు, రిటైర్డ్ పోలీసు అధికారులకు సన్మాన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. వ్యక్తిగతంగా, సమూహాలలో మట్టి దీపంతో ప్రతిజ్ఞ చేయాలని, ఇట్టి ప్రోగ్రామ్ ను పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా అమలు చేయాలని తెలిపారు. వసుధ వందనం కార్యక్రమంలో భాగంగా 75 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈనెల 14న దేశ విభజన గాయాల స్మారక దినం రోజున మౌన ప్రదర్శన నిర్వహించాలని సూచించారు. 13 ,14 , 15 తేదీల్లో హర్ ఘర్ తిరంగా, ప్రతి ఇంటి పైన, కార్యాలయం పైన, కూడలి లో జాతీయ జెండా ఎగర వేయించడానికి కృషి చేయాలన్నారు. 16నుండి 26 తేదీ వరకు దేశఅమరవీరుల అన్ని గ్రామాల నుండి మట్టి సేకరణ చేపట్టాలని సూచించారు. దేశం మట్టిని కలుపుతుందని, మట్టికి నివాళులర్పిస్తూ వీరులకు వందనం అర్పించే ఉద్దేశంతో 'నా మట్టి నా దేశం' 'నేను పుట్టిన నన్ను కన్న దేశం'. మన మట్టికి నమస్సులు- మన వీరులకు వందనం పేరిట ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దేశ సమగ్రతను, ఐక్యతను, ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తిని నింపడం కొరకు, దేశం కోసం, దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు విడిచి చరిత్రలో కనీస గుర్తింపు నోచని ఎంతోమంది వీరులను, వీరనారులను వెలికి తీసి, దేశం నలుమూలలా ప్రతి గడ్డ నుండి పిడికెడు మట్టినీ సేకరించి వారందరి జ్ఞాపకార్థం దేశ రాజధానిలో అమృత వనం నిర్మించనున్నారని, అలాగే అమరులందరినీ స్మరించుకునేలా అమరవీరుల స్మారక స్థూపం ఏర్పాటు చేయనున్నారని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా చరిత్రలో కనుమరుగైపోయిన ఎంతో మంది అమరవీరులను గుర్తించే అవకాశం వచ్చిందని, వారి స్ఫూర్తినీ కొనసాగించడానికి బిజెపి మోడీ ప్రభుత్వం చేపట్టిన మేరా మాటి మేరా దేశ్ వంటి ప్రోగ్రాం ఎంతో దోహదపడుతుందన్నారు.30 తేదీ వరకు జరిగే కార్యక్రమలన్నిటీని బిజెపి శ్రేణులందరూ విజయవంతం చేయాలని పిలుపునీచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి, మానకొండూర్ నియోజకవర్గం ఇంచార్జి గడ్డం నాగరాజు,మండల పార్టీ అధ్యక్షులు రాపాక ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబటి తిరుపతి రాజు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి తూర్పాటి రాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మియాపురం లక్ష్మణచారి, మండల కార్యదర్శి కాటమొగిలి, ఓబీసీ మోర్చా మండల ప్రధానకార్యదర్శి ఏదులాపురం అశ్వన్ తేజ, మండల కార్యవర్గ సభ్యులు నందగిరి బలరాం, కోల శ్రీనివాస్, సరస్వతీ విద్యాలయం కరస్పాండెంట్ రంగు శ్రీనివాస్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి బండ రాజిరెడ్డి, సీనియర్ నాయకులు కనుకం నాగయ్య, చిట్యాల లక్ష్మయ్య, రావుల వెంకటరాజం, తిక్క దేవేందర్, రామ్ రెడ్డి, కృష్ణారెడ్డి, గట్టయ్య, నరేందర్ రెడ్డి, బుర్ర రాజు,గాడ్డి సదయ్య, గడ్డి సంపత్, జింక పరశురాములు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం



కరీంనగర్,ఆగస్టు12 (మనం న్యూస్): గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతి సందర్భంగా ' జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం ' ను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ గారి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రంగనాథన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.గ్రంథపాలకులను పెన్ను పుస్తకం ను అందించి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయాల పితామహుడు , గ్రంథాలయ సంస్కరణలు చేసి అనేక పుస్తకాలను గ్రంథాలయాల అభివృద్ధి కోసం రాసి వాటి నిర్వహణకు విధివిధానాలను రూపొందించిన సంస్కర్త రంగనాథన్ అని అన్నారు.జిల్లా లోని ఉత్తమ గ్రంథ పాలకులైన గ్రేడ్ 1 లైబ్రేరియన్ శ్రీమతి, గ్రేడ్ 3 లైబ్రేరియన్ లు నాగభూషణం మరియు మహేష్ లను ఘనంగా పెన్ను మరియు పుస్తకాలను అందించి శాలువాతో పాఠకులు మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ గారు సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మల్లేంకి శ్రీనివాస్ , ఆరే రవి గౌడ్ , వడ్లకొండ పర్శురాం, గ్రంథాలయ సంస్థ సిబ్బంది మల్లేశం , పవన్, శెషి తదితరులు పాల్గొన్నారు.

# నీళ్ళ కుళాయి పెట్టాలన్న సోయి పాలకులకు లేదు

### చేపల మార్కెట్,మటన్ మార్కెట్ కూపంగా మారింది

### నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్,ఆగస్టు12 (మనంన్యూస్): ప్రతి రోజూ వందల మంది వ్యాపారులు వేల మంది కొనుగోలు దారులు వచ్చే రైతు బజార్ లో కనీసం ఒక్క మంచి నీళ్ళ కుళాయి కూడా ఏర్పాటు చేయక పోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని నగర కాంగ్రెస్ అధ్యక్షులుకోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం లో భాగంగా శనివారం అంగడి,రైతు బజార్, నేత బజార్ లో వ్యాపారులను,రైతులను,కొనుగోలు దారులను కలిసి కాంగ్రెస్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ అక్కడి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఫిష్ మార్కెట్,మటన్ మార్కెట్ బిల్డింగ్ మురికి కూపంగా మారిందని నరేందర్ రెడ్డి అన్నారు.వెంటనే మంచి నీళ్ళ కుళాయి ఏర్పాటు చేయాలని,ఫిష్,మటన్ చికెన్ మార్కెట్ వ్యాపారులకు బిల్డింగ్ కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అష్రఫ్ ఖురేషి,అలీమ్, మహమ్మద్ భారీ,ఎండి బషీర్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,ముక్క భాస్కర్,దండి రవీందర్,మెతుకు కాంతయ్య,జీడి రమేష్,అన్నే జ్యోతి రెడ్డి,ఎగ్గడి శారద,మహాలక్ష్మి,ఉప్పరీ అజయ్,షేక్ శేహెన్షా,ఇమామ్,నాగుల సతీష్,వంగల విద్యా సాగర్,ఖలీల్,సలిమొద్దీన్,కీర్తి కుమార్,అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

# అనుచరుల లబ్ధి కోసమేనా మంత్రి పదవి

**- గంగుల అనుయాయులకే బిసి రుణాలు**

**- అర్హులకు అన్యాయం చేస్తోన్న మంత్రి**

**: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్**

**నియోజకవర్గ నాయకులు రోహిత్ రావు**



కరీంనగర్, ఆగస్టు 12 (మనం న్యూస్): బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అతని అనుచరుల లబ్ధి కోసమే మంత్రిగా వ్యవహరిస్తున్నారా..? అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు మెన్నేని రోహిత్‌రావు ప్రశ్నించారు. నియోజకవర్గంలో వేలాది మంది నిరుపేద బిసిలు రుణాలకోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తుండగా, మంత్రి అనుచరులకు మాత్రం బిసి కోటా కింద లక్షల రూపాయల రుణాలను అందించారని ఆరోపించారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రోహిత్‌రావు మాట్లాడుతూ మంత్రి గంగుల కమలాకర్ బిసి స్పెషల్ కోటా రుణాలను తన అనుచరులకే అందించి నిజమైన బిసిలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. సమాచార హక్కు చట్టం కింద అధికారులు అందించిన సమాచారం మేరకు మంత్రి అనుచరుల వివరాలు వెల్లడైనట్లు తెలిపారు.

బిసి సంక్షేమ శాఖ, బిసి కార్పొరేషన్ ద్వారా 2016 నుండి 2023 వరకు స్పెషల్ కోటా రుణాలను 14 మంది మంత్రి అనుచరులకు ఇప్పించారని తెలిపారు. అర్హులైన బీసీలను గుర్తించి వారికి అందించాల్సిన ఈ సహాయాన్ని దుర్వినియోగపరిచి కేవలం తన అనుచరులకే ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి గంగులపై మండిపడ్డారు. 14 మంది అర్హులలో 10 మంది కరుడు గట్టిన గంగుల కమలాకర్ అనుచరులని, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలని పేర్కొంటూ ఫోటోలు ప్రదర్శించారు. మంత్రి అనుచరులైన గోడల రంజిత్ కుమార్, కర్ర సూర్యశేఖర్, మునిపల్లి ఫణితలకు మూడు లక్షల రూపాయల చొప్పున ఉప్పు రాజశేఖర్, మొగిళోజి వెంకటేష్, కందుకూరి సాయి కృష్ణ, జక్కు అజయ్, పొన్నం నాగరాజు, తాటి పవన్ కుమార్, పూసల వనితలకు ఐదు లక్షల రూపాయల చొప్పున రుణాలను అందించినట్లు రోహిత్‌రావు వివరించారు. పూసల శ్రీకాంత్ అనే వ్యక్తి మొదట తన భార్య పూసల వనిత పేరిట ఐదు లక్షల రుణం పొంది, ఇటీవల విడుదలైన బీసీ బందు పథకం ద్వారా లక్ష రూపాయలు పొందారని తెలిపారు. మంత్రి గంగుల కమలాకర్ తెలంగాణ బిసి మంత్రా..? ఈ పది మందికి మాత్రమే మంత్రా అని ప్రశ్నించారు. భజనపరులపై పెట్టిన దృష్టిని జిల్లాలోని బీసీ బిడ్డలపై పెట్టడం లేదని మండిపడ్డారు. లోన్స్ పొందిన వారే గంగుల కమలాకర్ కి చెంచాలుగా, పేడ్ బ్యాచ్ గా సోషల్ మీడియాలో ఒక బృందంగా ఏర్పడి ప్రశ్నించిన ప్రతిపక్ష నేతల పై అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఇదే బృందం తమ నివాసం పై కూడా దాడి చేసారని ఆరోపించారు. జిల్లా మంత్రిగా తన బాధ్యతను మరిచి కేవలం కరీంనగర్ నియోజకవర్గం ప్రజలకే ఈ లోన్లు ఇచ్చారని, చొప్పదండి, మానకొండూర్, హుజురాబాద్ , హుస్నాబాద్ ప్రాంతాల బీసీలకు ఇదే బీసీ స్పెషల్ లోన్స్ ఎందుకు అందివ్వలేదని ప్రశ్నించారు. మంత్రికి కరీంనగర్ పైన అంతగా ప్రేముంటే నియోజకవర్గంలో ఎంతమందికి డబుల్ బెడ్ రూమ్ లు, దళిత బంధు, మైనారిటీ లోన్ పథకాలను అందించారో తెలపాలన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, టీపీసీసీ సెక్రటరీ రహమాత్ హుస్సేన్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఆమీర్, రూరల్ మండల నాయకులు కామిరెడ్డి రామిరెడ్డి, కొత్తపల్లి మండల నాయకులు పంజాల స్వామి గౌడ్, కిసాన్ కాంగ్రెస్ కొత్తపల్లి అధ్యక్షులు సిరిపురం నాగరాజు, వంశీ, అజయ్, మల్లికార్జున్, పిట్టల సాయి, వాజీద్, సాజిద్, సమీర్, బుర్ర రాహుల్ గౌడ్, భూక్య ప్రేమ్ నాయక్, బుర్ర హరీష్ గౌడ్, చామన పల్లి సంపత్, జెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంలో గద్దర్ సంతాప సభ

**ఘనంగా నివాళ్లు అర్పించిన నాయకులు**



కరీంనగర్, ఆగస్టు 12 (మనం న్యూస్): తెలుగుదేశం పార్లమెంట్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బోలుమల్ల సదానందం ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు, యుద్ధ నౌక గద్దర్ సంతాప సభ తెలుగుదేశం పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం మాట్లాడుతూ గద్దర్ ఒక సామాన్య దళిత కుటుంబంలో జన్మించి 1969 ఉద్యమ మొదలు చనిపోయేంతవరకు పేద ప్రజల గొంతుకై తన ఆట, పాట, మాటల ద్వారా సమాజంలో ఉన్న అకృత్యాలు, అన్యాయా లను ఎండగట్టారన్నారు. బ్యాంకు ఉద్యోగాన్ని వదిలి బడుగు, బలహీన వర్గాలను మేలుకొల్పి, చైతన్య పరచడం కోసం జననాట్యమండలిలో చేరి సాయుధ పోరాటంలో ఎన్నో వేల పాటలు రాసి పాడిన గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. గద్దర్ లేని లోటు పూడ్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాడ పు ఆగయ్య. కరీంనగర్ నియోజకవర్గ గంగాధర కనకయ్య ముదిరాజ్ మానకొండూరు కోఆర్డినేటర్ ఎడ్ల వెంకటయ్య, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు నందాల శివ, ఏసీ సెల్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు పోతుల రమేష్, జిల్లా నాయకులు సందబోయిన రాజేశం, రోడ్డ శ్రీనివాస్, తీగుట్ల రమేష్, రొడ్డ శ్రీధర్, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఆకుల కాంతయ్య, పెరుమాళ్ళ సతీష్ గౌడ్, ఇట్ట మల్లేశం తదితర నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత బస్సుపాసుల పంపిణీ

శంకరపట్నం, ఆగస్టు 12 (మనం న్యూస్): శంకరపట్నం మండల కేంద్రం లోని కేశవపట్నం బస్టాండులో శనివారం దివ్యాంగులకు ఉచిత బస్సు పాస్‌లను దాతల సహకారంతో హుజురాబాద్ డిపో మేనేజర్ పి.అర్పిత అందజేశారు. కేశవపట్నం రైస్ మిల్లర్ల అసోసియేషన్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత బస్సు పాసులను రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులు గర్రెపల్లి శంకర్ లింగం, తణుకు ప్రభాకర్, బాబన్న, ఓంకారంలు 120 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ దేవేందర్ రెడ్డి, గుర్రం స్వామి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.




మనం కావలెను
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

మంచిర్యాల జిల్లా: మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, హాజిపూర్, లక్షెటిపేట్, దండెపల్లి, జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, కన్నెపల్లి, నెన్నెల్, భీమిని, తాండూర్, కాసిపేట.

ఆసిఫాబాద్ జిల్లా: కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాలా, చింతలమానెపెల్లి, పెంచికలపేట్, బెజ్జూరు, దహేగాం, రెబ్బెన, వాంకిడి, జైనూర్, కెరమెరి, సిప్పూర్(యు), తిర్యాని.
మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

నిర్మల్ జిల్లా: నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

ఆదిలాబాద్ జిల్లా: అదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నం:
సెల్ : 96666 99086, 83339 98076

# నిజామాబాద్

## బిజెపి జిల్లా అధ్యక్షులు పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు




### నియోజకవర్గ బిజెపి నాయకులు

బోధన్ ఆగస్టు 12, (మనం న్యూస్)ః భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బస్వ లక్ష్మి నరసయ్య పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని బోధన్ నియోజకవర్గ బిజెపి నాయకులు ధ్వజమెత్తారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా పార్టీ నే నమ్ముకుని అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన సీనియర్ నాయకులకు జిల్లా అద్యక్షుడు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు సమావేశాలు నిర్వహిస్తూ స్వార్థ పూరితంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.భాజపా పార్టీ సిద్ధాంతలకు వ్యతిరేకంగా ప్రవర్తించినందుకు సీనియర్ నాయకులు పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 13 మండలాలకు సంబంధించిన అధ్యక్షులను రాత్రికి రాత్రే మార్చివేయ్యడం పై అసహనం వ్యక్తం చేశారు .వివిధ మోర్చాల అధ్యక్షులు తదితరులు పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ఈ రాజీనామాలు సోమవారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులకు అందచెయ్యడం జరుగుతుందని తెలిపారు. తాము కేవలం పదవులకు మాత్రమే రాజీనామా చేస్తున్నామని జీవిత కాలం కమల దళంలోనే కార్యకర్తలుగా కొనసాగుతామని పేర్కొన్నారు. ఇకనైనా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకొని అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు.రాజీనామా చేసిన వారిలో ఎడపల్లి మండల బిజెపి జనరల్ సెక్రటరీ సతీష్ గౌడ్, బిజెవైయం మండల ప్రెసిడెంట్ ప్రణయ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కృష్ణ, ఎస్టీ మోర్చా అధ్యక్షులు రమేష్, ఎస్సి మోర్చా అధ్యక్షులు కొటేశ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు పోశెట్టి, కిసాన్ మోర్చా జనరల్ సేకరిట్రీ చిన్నారెడ్డి, మైనార్టీ మోర్చా అధ్యక్షులు దేవేందర్ సింగ్, ఒబీసి మోర్చా మండల కన్వీనర్ రాజేందర్ గౌడ్ , మండల కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.


## కనీస సదుపాయాలు కరవై తీవ్ర ఇబ్బందులు

### శివసేన పట్టణాధ్యక్షులు గౌతమ్ గౌడ్



బోధన్, ఆగస్టు 12 (మనం న్యూస్)ః స్థానిక 19 వ వార్డు ఇందిరమ్మ కాలనీ లో ప్రజలు మౌళిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారని శివసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏనుగంటి గౌతమ్ గౌడ్ అన్నారు. శనివారం శివసేన పార్టీ ఆధ్వర్యంలో కాలనీ ప్రజల దగ్గరికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులకు ప్రధానంగా మంచినీటి సమస్య ఉన్నదని, మురికి కాల్వలు లేకపోవడంతో డెంగ్యూ మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారన్నారు. సరైన రోడ్లు లేకపోవడంతో విద్యార్థులకు, కాలనీ వాసులకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మావతి శరత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై శివసేన పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాండవుల భూమయ్య, ఉపాధ్యక్షులు మధుబాబు, ప్రధాన కార్యదర్శి రవికిరణ్, శివ సేన నాయకులు నర్సింలు, బిళ్ళ విజయ్, నరేందర్, శ్రీకాంత్, దుడ్డెల విజయ్, రాజు, శ్రీను, లక్ష్మణ్, రాము, గంగాధర్, డిగంబర్, గంగాధర్, దీపక్, నాగరాజు, బివియస్ నాయకులు లోకేష్ గౌడ్, కాస్ప లింగం కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీంగల్ పట్టణ వాసి ఉరి వేసుకుని మృతి



భీంగల్, ఆగస్ట్ 12 (మనం న్యూస్)ః భీంగల్ పట్టణానికి చెందిన సూర భీమన్న ( 54 ) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. తాగుడుకు బానిసైన భీమన్న తాగేందుకు డబ్బులు లేకపోవడంతో కుప్పకంటి రోడ్డులోని వాటర్ ట్యాంక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని భార్య ఎల్లవ్వ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు.

## సెస్ చైర్మన్ రామారావు పద్మశాలీలకు క్షమాపణ చెప్పాలి

రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 12 (మనం న్యూస్): పద్మశాలీలను అగౌరవ పరిచేలా వ్యాఖ్యలు చేసిన సెస్ చైర్మన్ చిక్కాల రామారావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సిరిసిల్ల పద్మశాలి కులసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు కలిగిన పద్మశాలీల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందికాదన్నారు. పద్మశాలి ఓట్లతో గెలిచామా అని వ్యాఖ్యానించిన రామారావు, పద్మశాలి కుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. రామరావు అనుచిత వ్యాఖ్యలు చేయడం వెనుక మంత్రి కెటిఆర్ అండదండలున్నాయని పద్మశాలి సామాజిక వర్గం భావిస్తుందన్నారు. ఇది అవాస్తమైతే సిరిసిల్ల పద్మశాలిలకు, బిసిలకు క్షమాపణ చెప్పించవలసిన బాధ్యత మంత్రి కేటీఆర్ పై ఉందని వారు పేర్కొన్నారు. లేని పక్షంలో సిరిసిల్లలో పద్మశాలిలే కాకుండా బిసి, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గం ప్రజలందరూ ఐక్యమై, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని సిరిసిల్లలో భూస్థాపితం చేసి, దొరల అహంకారానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, నాయకులు సిరస్వాల్ కైలాష్ ఎనగంటి నరేష్, గుడ్ల విష్ణు, చొప్పదండి శ్రీనివాస్, దూడం శివప్రసాద్, గాజుల సదానందం, మోర శ్రీనివాస్, ద్యావ పెల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

